క్లుప్తంగా

తల్లిపేరుతో మొక్కలు నాటాలి



ధర్మారంలో మొక్క నాటుతున్న రాంబాబు, కుటుంబ సభ్యులు

గీసుకొండ : తల్లి పేరుతో మొక్కలు నాటాలని బీజేపీ రాష్ట్ర కౌన్సిల్ సభ్యుడు గట్టికొప్పుల రాంబాబు అన్నారు. గ్రేటర్ వరంగల్ నగరం 16వ డివిజన్ ధర్మారంలో బుధవారం తల్లిపేరుతో మొక్కలు నాటే కార్యక్రమాన్ని చేపట్టారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ బీజేపీ రాష్ట్ర కమిటీ పిలుపు మేరకు ప్రతీ బీజేపీ కార్యకర్త తల్లి పేరుతో మొక్కలు నాటాలని రాంబాబు సూచించారు.

రేపటి ధర్నాను జయప్రదం చేయాలి

నర్సంపేట : విద్యారంగాన్ని విధ్వంసం చేసే విధానాలను ప్రతిఘటిస్తూ విద్యాపరిరక్షణ కోసం ఈనెల 27న హైదరాబాద్ ఇందిరాపార్కు వద్ద నిర్వహించే ధర్నాకు ఉపాధ్యాయులు, విద్యాభిమానులు, మేధావులు అధిక సంఖ్యలో తరలివచ్చి విజయవంతం చేయాలని విద్య పరిరక్షణ కమిటీ ప్రతినిధి, డీటీఎఫ్ మండల శాఖ అధ్యక్షుడు ఆంగోతు భద్రయ్య కోరారు. మండల కేంద్రంలో బుధవారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అమలు చేస్తున్న విద్య వ్యతిరేక విధానాలతో విద్యారంగం మొత్తం నిర్వీర్యం అవుతుందన్నారు. విద్యారంగానికి అధిక నిధులు కేటాయించి విద్యారంగాన్ని కాపాడాలన్నారు. కార్యక్రమంలో ఉపాధ్యాయ సంఘ నాయకులు ఉమాశంకర్, యాకయ్య, కొమురయ్య, రవి, వెంకటేశ్వర్లు, కట్టస్వామి, మంజులవాణి, తదితరులు పాల్గొన్నారు.

ఉప్పరపల్లి వైన్‌షాప్‌ను తరలించాలి

నర్సంపేట : చెన్నారావుపేట మండలంలోని ఉప్పరపల్లి గ్రామంలో నిబంధనలకు విరుద్ధంగా నడుస్తున్న వైన్‌షాప్‌ను తరలించాలని గ్రామస్తులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. గ్రామంలోని ప్రధాన సెంటర్‌లో వైన్‌షాపు ఉండడం వల్ల యువత చెడు అలవాట్లు, మద్యానికి బానిసలై బలైపోతున్నారని పలు సంఘాలు, రాజకీయ నాయకులు, వ్యాపారవేత్తలు, వ్యవసాయదారులు గ్రామపెద్దలు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. గ్రామంలోని వైన్‌షాపును వేరే చోటకు తరలించకపోతే ఆందోళన కార్యక్రమాలు చేపడతామని హెచ్చరించారు. ఇప్పటికైనా ఎక్సైజ్ శాఖ అధికారులు తగిన చొరవ తీసుకుని వైన్‌షాప్‌ను తరలించాలని డిమాండ్ చేశారు.

'విధ్వంసపు విధానాలను వ్యతిరేకించాలి'



కరపత్రాలను ఆవిష్కరిస్తున్న నర్సింహులు

ఖానాపురం : ప్రభుత్వం విద్యను విధ్వంసం చేసే విధానాలను వ్యతిరేకించాలని తెలంగాణ విద్యా పరిరక్షణ కమిటీ జిల్లా కార్యదర్శి కట్కూరి నర్సింహులు అన్నారు. మండల కేంద్రంలో విద్యాపరిరక్షణ కమిటీ ఆధ్వర్యంలో ధర్నా కరపత్రాలను బుధవారం ఆవిష్కరించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ ప్రభుత్వ విద్యకు కేంద్ర ప్రభుత్వం 10 శాతం, రాష్ట్ర ప్రభుత్వం 20 శాతం నిధులను బడ్జెట్‌లో కేటాయించాలన్నారు. నియోజకవర్గానికో ఇంటర్నేషనల్ స్కూల్ ప్రతిపాదనను వెంటనే ఉపసంహరించుకోవాలన్నారు. కార్యక్రమంలో హెచ్‌ఎం పద్మావతి, రజితదేవి, సురేందర్, ప్రభాకర్, బాలాజీ, తదితరులు పాల్గొన్నారు

ఖాతాదారులందరూ బీమా చేయించుకోవాలి



చెక్కు అందజేస్తున్న మేనేజర్ వెంకటయ్య

సంగెం : బ్యాంకు ఖాతాదారులందరూ ప్రధాన మంత్రి జీవన్ జ్యోతి వంటి బీమా పథకంలో చేరితే భవిష్యత్‌లో కుటుంబానికి భరోసా ఉంటుందని తెలంగాణ గ్రామీణ వికాస్ బ్యాంకు మేనేజర్ సుల్తాన్ వెంకటయ్య అన్నారు. మండల కేంద్రానికి చెందిన మెట్టుపల్లి భాస్కర్ ఇటీవల మృతి చెందాడు. బ్యాంకు ఖాతాదారుడైన భాస్కర్ పీఎంజీ బీమా పథకంలో ఏడాదికి రూ.436 చెల్లించాడు. బీమా పథకం ద్వారా వచ్చిన రూ.2లక్షల చెక్కును నామిని మృతుడి తల్లి శాంతమ్మకు బుధవారం అందజేశారు. ఈ కార్యక్రమంలో అకౌంటెంట్ మౌనిక, క్యాషియర్ విష్ణువర్ధన్, సిబ్బంది పాల్గొన్నారు.

చిన్నారులను ఆకర్షించేందుకు..

ప్రభుత్వ పాఠశాలల్లో ప్రీ ప్రైమరీ తరగతులు

- 13 స్కూళ్లలో ప్రారంభం



రాంతీర్థం ప్రాథమిక పాఠశాలలో చిన్నారులతో హెచ్‌ఎం శ్రీదేవి



లెంకాలపల్లిలో చిన్నారులతో ప్రధానోపాధ్యాయుడు రాంబాబు

నల్లబెల్లి : ప్రభుత్వ పాఠశాలలను బలోపేతం చేయాలనే లక్ష్యంతో రాష్ట్ర ప్రభుత్వం 2025–26 విద్యా సంవత్సరంలో చిన్నారులను ప్రభుత్వ బడులవైపు ఆకర్షించేందుకు ప్రీ ప్రైమరీ తరగతులు నర్సరీ, ఎల్‌కేజీ, యూకేజీ తరగతులు బోధించేందుకు అనుమతులు ఇచ్చింది. జిల్లాలో 13 ప్రభుత్వ పాఠశాలల్లో ప్రీ ప్రైమరీ తరగతులు నిర్వహించేందుకు అనుమతులు ఇస్తూ విద్యాశాఖ ఇటీవల ఉత్తర్వులు జారీ చేసింది. జిల్లాలో స్వామిరావుపల్లి, లక్కమారిపల్లి, తొగర్రాయి, రాంతీర్థం, లింగాపురం, కొండూర్, కొత్తూరు, బుర్హాన్‌పల్లి, పైడిపల్లి ప్రాథమిక పాఠశాలలో, రేకంపల్లి, లెంకాలపల్లి, గన్నారం ప్రాథమిక పాఠశాలతో పాటు శంభునిపేట ప్రభుత్వ ప్రాథమిక పాఠశాల్లో ఈ తరగతులు కొనసాగుతున్నాయి. ఆయా పాఠశాలలో చిన్నారులకు ప్రవేశాలు కల్పించి ఆటపాటలతో చదువును బోధిస్తున్నారు.

గతేడాది నుంచే..

నల్లబెల్లి మండలంలోని రాంతీర్థం, లెంకాలపల్లి ప్రాథమికోన్నత పాఠశాలల్లో ప్రీ ప్రైమరీ తరగతులు నిర్వహించాలనే సంకల్పంతో హెచ్‌ఎంలు శ్రీదేవి, రాంబాబులు ఆయా పాఠశాలల్లో ఉపాధ్యాయులు, తల్లిదండ్రులతో ప్రత్యేక సమావేశాలు నిర్వహించారు. చిన్నారుల భవిష్యత్‌ను తీర్చిదిద్దుతామని తల్లిదండ్రుల్లో భరోసా కల్పించారు. పలుమార్లు సమావేశాలకు హాజరైన తల్లిదండ్రులు హెచ్‌ఎంలతో పాటు ఉపాధ్యాయుల అంకిత భావాన్ని గుర్తించి చిన్నారులను ప్రభుత్వ పాఠశాలలోని ప్రీ ప్రైమరీ పాఠశాలలకు పంపించేందుకు ముందుకువచ్చారు. ఆయా పాఠశాలల్లో ఉపాధ్యాయుల సమష్టి కృషితో గత విద్యా సంవత్సరం నుంచే రాంతీర్థం ప్రాథమిక పాఠశాలలో ఎల్‌కేజీ, యూకేజీలో 14 మంది చిన్నారులకు విద్యాబోధన చేయగా, లెంకాలపల్లి ప్రాథమికోన్నత పాఠశాలలో ఎల్‌కేజీ, యూకేజీలో 18 మంది చిన్నారులకు విద్యాబోధన చేశారు. చిన్నారుల వివరాలను విద్యాశాఖ అధికారుల అనుమతితో యూడైస్‌లో ఆన్‌లైన్‌లో నమోదు చేయించారు. ఈ యేడాది ఈ పాఠశాలల్లో ప్రీ ప్రైమరీ తరగతులు నిర్వహించేందుకు రాష్ట్ర ప్రభుత్వం ఇటీవల అనుమతి ఇస్తూ ఉత్తర్వులు జారీ చేసింది. దీంతో ఆయా హెచ్‌ఎంలు, ఉపాధ్యాయులతో పాటు తల్లిదండ్రులు హర్షం వ్యక్తం చేస్తున్నారు.

మరిన్ని పాఠశాలల్లో నిర్వహించేందుకు కృషి



ప్రభుత్వ పాఠశాలలో నిర్వహిస్తున్న ప్రీ ప్రై మరీ తరగతులను తల్లిదండ్రులు సద్వినియోగం చేసుకోవాలి. ప్రీ ప్రైమరీ తరగతులు నిర్వహించాలని తల్లిదండ్రులు కోరితే ఉన్నతాధికారుల దృష్టికి తీసుకవెళతాం. మండలంలో మరిన్ని పాఠశాలలో ప్రీ ప్రైమరీ తరగతులు నిర్వహించేందుకు అనుమతి వచ్చేలా కృషి చేస్తాం. – అనురాధ, ఎంఈఓ, నల్లబెల్లి

అప్రకటిత ఎమర్జెన్సీకి వ్యతిరేకంగా పోరాడాలి

- సీపీఎం జిల్లా కమిటీ సభ్యుడు కోరబోయిన కుమారస్వామి



నర్సంపేట : మాట్లాడుతున్న కుమారస్వామి

నర్సంపేట : మోదీ పాలనలో అమలవుతున్న అప్రకటిత ఎమర్జెన్సీకి వ్యతిరేకంగా పోరాడాలని సీపీఎం జిల్లా కమిటీ సభ్యులు కోరబోయిన కుమారస్వామి అన్నారు. సీపీఎం పట్టణ కమిటీ సభ్యుడు గడ్డమీది బాలకృష్ణ అధ్యక్షతన బుధవారం సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ 1975 జూన్ 25న నాటి ప్రధాని ఇందిరాగాంధీ ప్రజల ప్రజాస్వామ్య హక్కులను తుంగలో తొక్కి దేశంలో ఎమర్జెన్సీ విధించి ప్రతిపక్ష పార్టీల నేతలు, కార్యకర్తలను నిర్బంధించి నెలల తరబడి జైల్లో పెట్టారని, ప్రధానంగా సీపీఎం నాయకులపై తీవ్ర నిర్బంధం ప్రయోగించారని అన్నారు. నాటి ఎమర్జెన్సీకి వ్యతిరేకంగా మాట్లాడే నైతిక అర్హత మోదీకి లేదన్నారు. కార్యక్రమంలో పార్టీ నాయకులు బుర్రి ఆంజనేయులు, ఎస్‌కె.అన్వర్, రాజు, కార్తీక్, అనిల్, ఫరీద, విజయ, స్వప్న, నాగమణి, లక్ష్మీ, శ్రీనివాసరెడ్డి, పాల్గొన్నారు.

మోదీ పాలనలో అప్రకటిత ఎమర్జెన్సీ

దుగ్గొండి: దేశంలో ప్రధాని మోదీ ఆధ్వర్యంలో అప్రకటిత ఎమర్జెన్సీ పాలన సాగుతుందని సీపీఎం జిల్లా నాయకుడు ఈసంపల్లి బాబు ఆరోపించారు. మండలంలోని గిర్నిబావిలో ఎమర్జెన్సీ వ్యతిరేక సదస్సు అక్కపెల్లి సుధాకర్ అధ్యక్షతన బుధవారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ దేశంలో 10 ఏళ్లుగా ప్రజాస్వామ్య హక్కులను కాలరాస్తూ ప్రతిపక్ష పార్టీల నేతలను జైళ్లలో పెడుతూ పాలన సాగిస్తున్నారని అన్నారు. కార్యక్రమంలో మండల కార్యదర్శి బోళ్ల సాంబయ్య, మండల నాయకులు పుచ్చకాయల నర్సింహారెడ్డి, కొంగర నర్సింహాస్వామి, నర్సింహారెడ్డి, రవి, మొగిలి, మహేందర్, మహేందర్, తదితరులు పాల్గొన్నారు.

విద్యాసంస్థల ఆగడాలను అరికట్టడంలో విఫలం



సమావేశంలో మాట్లాడుతున్న సందీప్

నర్సంపేట : రాష్ట్రవ్యాప్తంగా ఉన్న ప్రైవేట్ విద్యాసంస్థల ఆగడాలను అరికట్టడంలో రాష్ట్ర ప్రభుత్వం, విద్యాశాఖ అధికారులు విఫలమయ్యారని యూఎస్‌ఎఫ్‌ఐ రాష్ట్ర ఉపాధ్యక్షుడు మొగిలిచర్ల సందీప్, పీడీఎస్‌యూ జిల్లా ఉపాధ్యక్షుడు కొమ్ముక రవి, ఎంఎస్‌ఎఫ్ జిల్లా అధ్యక్షుడు చింతం సిద్దూ మండిపడ్డారు. పట్టణంలో బుధవారం యూఎస్‌ఎఫ్‌ఐ, పీడీఎస్‌యూ, ఎంఎస్‌ఎఫ్ ఐక్య విద్యార్థి సంఘాలు సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ విద్యాధికారులు యాజమాన్యాలు ఇచ్చే మామూళ్లకు అలవాటు పడి వాటిపై చర్యలు తీసుకోకుండా నిర్లక్ష్యంగా వ్యవహరించడమే కాకుండా వారికి వత్తాసు పలుకుతున్నారని మండిపడ్డారు. ప్రైవేట్ కార్పొరేట్ విద్యా సంస్థల్లో 25 శాతం పేద విద్యార్థులకు ఉచిత విద్యను అందించాలని ఉన్నా వాటిని అమలు చేయడంలో విద్యాధికారులు పూర్తిగా నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నారని ఆరోపించారు. జిల్లాలో ప్రైవేటు కార్పొరేట్ విద్యా సంస్థలు బుక్స్, డ్రెస్సుల పేరుతో వేల రూపాయలను వసూలు చేస్తూ విద్యా కేంద్రాల్లో షాపులు పెట్టి మరీ నడుపుతున్న అధికారులు ఏ మాత్రం చర్యలు తీసుకోవడం లేదన్నారు. రాష్ట్ర వ్యాప్తంగా ఉన్న విద్యాధికారులపై వారి విధుల పట్ల విచారణ జరపడం కోసం రాష్ట్ర ప్రభుత్వం ప్రత్యేక కమిటీ ఏర్పాటు చేయాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో విద్యార్థి సంఘం నాయకులు స్వాతిక, కీర్తన, అలేఖ్య, సిద్దు, ప్రభాస్, నితీష్, తదితరులు పాల్గొన్నారు.

అర్హులైన ప్రతీ ఒక్కరికి పథకాలు

- ఎంపీడీఓ గుగులోతు కిషన్‌నాయక్



మాట్లాడుతున్న ఎంపీడీఓ కిషన్

రాయపర్తి : అర్హులైన ప్రతీ ఒక్కరికి కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ప్రవేశపెట్టే పథకాలు అందించేందుకు చర్యలు చేపడుతున్నట్లు ఎంపీడీఓ గుగులోతు కిషన్ నాయక్, తహసీల్దార్ శ్రీనివాస్ తెలిపారు. బుధవారం మండలంలోని జగన్నాథపల్లి గ్రామ పరిధిలోని కొత్తతండాలో కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల నుంచి అమలవుతున్న పథకాలకు అర్హులైన వారిని గుర్తించేందుకు జనజాతి గౌరవ్ రెకో గ్రామసభను నిర్వహించారు. కార్యక్రమంలో పాల్గొన్న ఎంపీడీఓ, తహసీల్దార్ మాట్లాడుతూ ప్రజలందరూ ప్రభుత్వం కల్పించిన అవకాశాలను సద్వినియోగం చేసుకోవాలని కోరారు. అర్హత ఉన్నట్లైతే వెంటనే అధికారులకు తెలపాలని కోరారు. భూభారతి, కులధృవీకరణ, నివాస ధృవీకరణ పత్రాలు, రేషన్‌కార్డుల కోసం దరఖాస్తు చేసుకున్నట్లైతే వెంటనే పరిష్కరిస్తామని తెలిపారు. కార్యక్రమంలో ఎంపీఓ కూచన ప్రకాష్, వెటర్నరీ డాక్టర్ శృతి, పల్లెదవాఖాన డాక్టర్ అనిత, ఏపీఎం కిరణ్, ఏపీఓ కుమార్, పాఠశాల హెచ్‌ఎం పద్మావతి, సివిల్‌సప్లయ్ డీటీ మధుసూదన్, పంచాయతీ కార్యదర్శులు పాల్గొన్నారు.

శ్మశానవాటిక స్థలాన్ని కాపాడాలి



తహసీల్దార్‌కు వినతిపత్రం అందజేస్తున్న కాలనీవాసులు

నర్సంపేట: ఆక్రమణకు గురైన శ్మశాన వాటిక స్థలాన్ని కాపాడాలని చెన్నారావుపేట నంబర్‌వన్ కాలనీ వాసులు కోరారు. బుధవారం చెన్నారావుపేట తహసీల్దార్ దిలావర్ మహమ్మద్ అబిద్ అలీకి వినతిపత్రం అందించారు. చెన్నారావుపేట ఎస్సీ కాలనీ శివారులో సర్వే నంబర్ 356/174లో ఉన్న మూడు ఎకరాల పైచిలుకు భూమి అన్యాక్రాంతమైందన్నారు. వెంటనే ఆక్రమణకు గురైన శ్మశాన వాటిక స్థలాన్ని కాపాడాలని కోరారు. దీంతో తహసీల్దార్ సమస్యను వారం రోజుల్లో పరిష్కరిస్తామని తెలిపారు. వినతిపత్రం ఇచ్చిన వారిలో కాలనీ పెద్ద బర్ల దేవదాస్, నర్సింగరావు, ఉప్పలయ్య, స్వామి, సాంబయ్య, రాజు, అనిల్, రాజేష్, ప్రవీణ్, తదితరులు పాల్గొన్నారు.

వైద్యసిబ్బంది సమన్వయంతో పనిచేయాలి

- డిప్యూటీ డీఎంహెచ్‌ఓ ప్రకాశ్



పీహెచ్‌సీలో రికార్డులను పరిశీలిస్తున్న డిప్యూటీ డీఎంహెచ్‌ఓ ప్రకాశ్

దుగ్గొండి : వైద్యసిబ్బంది సమన్వయంతో పనిచేస్తూ సీజనల్ వ్యాధులు ప్రబలకుండా చూడడంతో పాటు వ్యాధి నిరోధక టీకాలు వందశాతం పూర్తి చేయాలని డిప్యూటీ డీఎంహెచ్‌ఓ ప్రకాశ్ అన్నారు. మండల కేంద్రంలోని పీహెచ్‌సీతో పాటు మల్లంపల్లి ప్రాథమిక ఆరోగ్య ఉప కేంద్రాన్ని బుధవారం ఆయన ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఆసుపత్రిలోని వివిధ రకాల రికార్డులను పరిశీలించారు. వ్యాధి నిరోధక టీకాల వివరాలను వైద్యాధికారి కిరణ్ రాజ్‌ను అడిగి తెలుసుకున్నారు. అనంతరం ఆయన మాట్లాడుతూ గృహ సందర్శన కార్యక్రమం ద్వారా గర్భిణీలు, బాలింతలు, చిన్నారులు, దీర్ఘవ్యాధిగ్రస్తుల వివరాలు తెలుసుకుని వైద్యసహాయం అందించే అవకాశం కలుగుతుందని అన్నారు. కార్యక్రమంలో మెడికల్ ఆఫీసర్ రాకేష్, పల్లె దవాఖాన వైద్యుడు భరత్‌కుమార్, హెచ్‌ఓ సాంబయ్య, హెచ్‌వీ సంధ్యారాణి, తదితరులు పాల్గొన్నారు.

భోజ్జనాయక్‌తండా పాఠశాలను ప్రారంభించాలి



పాఠశాలను పరిశీలిస్తున్న గ్రామపెద్దలు

నర్సంపేట రూరల్ : మండలంలోని భోజ్జనాయక్ తండా ప్రాథమిక పాఠశాల పదేళ్ల క్రితం మూతపడిందని, దీంతో విద్యార్థులు మాధన్నపేట, భాంజీపేటకు వెళ్లి చదువుకోవాల్సి వస్తుందని, మళ్లీ పునఃప్రారంభిస్తే విద్యార్థులను భోజ్జనాయక్‌తండా పాఠశాలకు పంపిస్తామని బీఎస్‌తండా వారియర్స్ గౌరవ సలహాదారుడు నాదం, ఉపాధ్యక్షుడు అజ్మీర సూరయ్య, అసోసియేట్ అధ్యక్షుడు భూక్య వీరన్నలు కోరారు. బుధవారం మండలంలోని భోజ్జనాయక్‌తండాకు పాఠశాలను పరిశీలించారు. పాఠశాల భవనం మైనర్‌రిపేరింగ్ ఉందని, పెయింటింగ్ వేయించాలని గుర్తించారు. వాటిని తండా పెద్దమనుషులు, బీఎస్‌తండా వారియర్స్ ఆధ్వర్యంలో సహాయ సహకారాలు అందిస్తామని, విద్యాశాఖాధికారులు పాఠశాలను తెరిపించి ఉపాధ్యాయులను కేటాయించాలని కోరారు. తండా విద్యార్థులను ఈ పాఠశాలకే పంపించేలా కృషి చేస్తామన్నారు. కార్యక్రమంలో యూత్ అధ్యక్షుడు భూక్య రాజు, రాకేష్, పెద్దమనుషులు శివరాం, సారయ్య, భద్రు, వీరన్న, నందు, కిషన్, తిరుపతి పాల్గొన్నారు.

ట్రాక్టర్ యూనియన్ అధ్యక్షుడిగా శ్యాంసుందర్‌రెడ్డి

దుగ్గొండి : మండలంలోని నాచినపల్లి గ్రామంలో ట్రాక్టర్ యూనియన్ నూతన కమిటీని బుధవారం ఎన్నుకున్నారు. అధ్యక్షుడిగా నల్ల శ్యాంసుందర్‌రెడ్డి, ఉపాధ్యక్షులుగా మాదాసి సాంబయ్య, చెన్నూరి కృష్ణారెడ్డి, కార్యదర్శి గా జు చరణ్‌రాజు, అకౌంటెంట్‌గా నర్ర రంగా రెడ్డి, కమిటీ సభ్యులుగా అంధ్య రాజు, నర్ర రమణా రెడ్డి, ఇజ్జగిరి రాజయ్య, నాగరబోయిన భాస్కర్, సాంబయ్యలు ఎన్నికయ్యారు.

గ్రామ కమిటీ ఎన్నిక



సంగెం : మండలంలోని తీగరాజుపల్లి గ్రామ మున్నూరుకాపు సంఘం కమిటీని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. అధ్యక్షుడిగా సోలగుడి ప్రమోద్‌కుమార్, ఉపాధ్యక్షుడిగా రంగరాజు శ్యాంసుందర్, ప్రధాన కార్యదర్శిగా రంగరాజు మహేష్ చంద్ర, సహాయ కార్యదర్శిగా సోలగుడి ప్రవీణ్‌కుమార్, కోశాధికారి సోలగుడి రామకృష్ణలను ఎన్నుకున్నట్లు తెలిపారు.

బాకీ ఉన్నా.. రైతు భరోసాను అందించాలి



మాట్లాడుతున్న నామాల సత్యనారాయణ

నర్సంపేట రూరల్ : రైతులకు బాకీ ఉన్నా రైతు భరోసాను వెంటనే విడుదల చేయాలని బీఆర్‌ఎస్ మండల అధ్యక్షుడు నామాల సత్యనారాయణ అన్నారు. మండల బీఆర్‌ఎస్ పార్టీ కార్యాలయంలో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వచ్చిన తర్వాత రైతు భరోసా ఎకరాకు రూ. 15వేల ఇస్తామని చెప్పి ఇవ్వకుండా మోసం చేసిందని, ఇప్పటి వరకు రైతులకు ఎకరాకు రూ. 19వేలు బాకీ ఉందని, తక్షణమే వాటిని ఇవ్వాలన్నారు. 2023–24 రబీలో ఒక్కో ఎకరానికి రూ. 2500, 2023–24 వానాకాలంలో ఒక్కో ఎకరానికి రూ. 7500, రబీలో ఒక్కో ఎకరానికి రూ.7500లు, 2024–25 వానాకాలంలో ఎకరానికి రూ. 1500లు ఎగ్గొట్టారన్నారన్నారు. మూడు ఎకరాలలోపు ఉన్న రైతులకు ఎకరాకు రూ. 6వేలు వేశారని విమర్శించారు. కార్యక్రమంలో బీఆర్‌ఎస్ మండల ప్రధాన కార్యదర్శి ఈర్ల నర్సింహారాములు, క్లస్టర్ ఇన్‌చార్జ్‌లు మోతె జయపాల్‌రెడ్డి, పద్మనాభరెడ్డి, కోడారి రవి, మోటూరి రవి, కందుల రాజిరెడ్డి, సంగెం శ్రీకాంత్ తదితరులు పాల్గొన్నారు.

మత్తు పదార్థాలకు దూరంగా ఉండాలి

- ఎక్సైజ్ సీఐ స్వరూప



వర్ధన్నపేట : సమావేశంలో మాట్లాడుతున్న ఎక్సైజ్ సీఐ స్వరూప



దుగ్గొండి: మాట్లాడుతున్న సీఐ సాయిరమణ

వర్ధన్నపేట : యువత, విద్యార్థులు మత్తు పదార్థాలకు దూరంగా ఉండాలని వర్ధన్నపేట ఎక్సైజ్ సీఐ స్వరూప తెలిపారు. అంతర్జాతీయ డ్రగ్స్ రహిత దినోత్సవం పురస్కరించుకొని బుధవారం స్థానిక ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో విద్యార్థులకు అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా సీఐ మాట్లాడుతూ విద్యార్థులు మత్తు పదార్థాలకు అలవాటు పడి వారి అమూల్యమైన జీవితాన్ని నాశనం చేసుకోవద్దని సూచించారు. ఎవరైనా డ్రగ్స్ వినియోగిస్తున్న, విక్రయిస్తున్నట్లు తెలిసినా వెంటనే పోలీసులకు సమాచారం ఇవ్వాలని తెలిపారు. ఏదైనా సైబర్ మోసం జరిగితే వెంటనే 1930 కి కాల్ చేసి సహాయం పొందాలని తెలిపారు. కార్యక్రమంలో పాఠశాల హెచ్‌ఎం రంగా అనిల్‌కుమార్, ఎన్‌సీసీ ఆఫీసర్ మనుజేందర్‌రెడ్డి, పాల్గొన్నారు.

యువత డ్రగ్స్‌కు బానిస కావొద్దు : సీఐ

దుగ్గొండి: విద్యార్థులు, యువత మాదక ద్రవ్యాలు, డ్రగ్స్‌కు అలవాటై భవిష్యత్‌ను బుగ్గిపాలు చేసుకోవద్దని సీఐ సాయిరమణ అన్నారు. మండలంలోని గిర్నిబావిలో మహాత్మాజ్యోతిబాపూలే గురుకుల విద్యాలయంలో డ్రగ్స్ వ్యతిరేక అవగాహన సదస్సు బుధవారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విద్యార్థులు ఒక లక్ష్యం నిర్దేశించుకుని ఆ లక్ష్య సాధన కోసం నిత్యం కష్టపడి చదవాలన్నారు. కార్యక్రమంలో ఎస్సై రణదీర్‌రెడ్డి, ప్రిన్సిపాల్ మల్లయ్య, ఉపాధ్యాయులు, తదితరులు పాల్గొన్నారు.

వ్యసనాలకు దూరంగా ఉండాలి



ఖానాపురం : వాల్‌పోస్టర్లను ఆవిష్కరిస్తున్న ఎస్సై రఘుపతి

ఖానాపురం : విద్యార్థులు వ్యసనాలకు దూరంగా ఉండాలని ఎస్సై రఘుపతి అన్నారు. మండలంలోని బుధరావుపేట మోడల్‌స్కూల్‌లో బుధవారం మాదకద్రవ్యాల దుర్వినియోగం, అక్రమ రవాణా వ్యతిరేక దినోత్సవాన్ని పురస్కరించుకొని అవగాహన సమావేశం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మాదక ద్రవ్యాలకు అలవాటుపడిన విద్యార్థులు జీవితాన్ని నాశనం చేసుకోవాల్సి వస్తుందన్నారు. అనంతరం డ్రగ్స్ నిర్మూలనపై ముద్రించిన వాల్‌పోస్టర్లను ఆవిష్కరించి విద్యార్థులతో ప్రతిజ్ఞ చేయించారు. కార్యక్రమంలో ప్రిన్సిపాల్ పెరక సునీత, రవికుమార్, రాజేందర్, పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.

సంక్షిప్త సమాచారం

స్థానిక ఎన్నికలకు సిద్ధం కావాలి

రాయపర్తి : స్థానిక సంస్థల ఎన్నికల్లో బీఆర్‌ఎస్ అభ్యర్థుల గెలుపుకోసం సిద్ధం కావాలని మాజీ ఎంపీపీ జినుగు అనిమిరెడ్డి, మాజీ జెడ్పీటీసీ రంగు కుమార్‌గౌడ్ పిలుపునిచ్చారు. బుధవారం మండలంలోని కొత్తూరులో స్థానిక ఎన్నికల కోసం కార్యకర్తలతో సన్నాహక సమావేశం నిర్వహించారు. మండలపార్టీ ప్రధానకార్యదర్శి పూస మధు, మాజీ సర్పంచ్ స్వామి, శ్రీనివాస్‌రెడ్డి, పాల్గొన్నారు.

ఎమ్మార్పీఎస్, ఎంఎస్‌పీ కమిటీల ఎన్నిక


రాయపర్తి: మండలంలోని పెర్కవేడులో ఎమ్మార్పీఎస్, ఎంఎస్‌పీ కమిటీలను బుధవారం ఏకగ్రీవంగా ఎన్నిక చేసినట్లు ఎమ్మార్పీఎస్ మండల ఇన్‌చార్జ్ జిల్లా ధర్మయ్య తెలిపారు. ఎమ్మార్పీఎస్ గ్రామ అధ్యక్షుడిగా గారె ప్రవీణ్, ఉపాధ్యక్షుడిగా కృష్ణ, ప్రధానకార్యదర్శిగా మహేందర్, కార్యదర్శిగా అనిల్, కోశాధికారిగా సంతోష్‌లను ఎన్నుకున్నారు. ఎంఎస్‌పీ అధ్యక్షుడిగా సోమయ్య, ఉపాధ్యక్షుడిగా నాగరాజు, ప్రధానకార్యదర్శిగా యాకయ్య, కార్యదర్శిగా స్వామి, సహాయకార్యదర్శిగా రాజు సభ్యులను ఎన్నుకున్నట్లు తెలిపారు.

బాధిత కుటుంబాలకు ఆర్థికసాయం

నర్సంపేట: చెన్నారావుపేట మండలంలోని పాపయ్యపేటకు చెందిన అన్నెబోయిన చందు ఇటీవల అనారోగ్యంతో మృతి చెందాడు. ఈ సందర్భంగా బుధవారం దాతలు రూ.20వేలు సేకరించి బాధిత కుటుంబానికి అందజేశారు. అందజేసిన వారిలో వెంకన్న, బుచ్చిరాములు, అనిల్, సునీల్, సయ్యద్ పాషా, రాజు కృష్ణ, అశోక్, జీవన్ ఉన్నారు.

గీసుకొండ : మండలంలోని పలు గ్రామాల్లో అనారోగ్యంతో మృతి చెందిన వారి కుటుంబాలకు కాంగ్రెస్ జిల్లా నాయకుడు, సామాజిక సేవకుడు అల్లం బాలకిషోర్‌రెడ్డి సహాయం చేసి ఆదుకున్నారు. ఎలుకుర్తిలో మంద బాబు, బత్తిని సత్తెమ్మ, విశ్వనాథపురం, సూర్యతండాలో బొజ్జ యాకమ్మ, బాగాతి మహేందర్, ఆంగోతు దస్రులు మృతి చెందగా ఒక్కో కుటుంబానికి రూ. 5 వేల చొప్పున సహాయం చేశారు. విశ్వనాథపురంలో సమ్మయ్య ఇల్లు ఇటీవల దగ్ధం కావడంతో అతడికి రూ.10 వేల సహాయం చేశారు. బుధవారం ఆయన పంపిన నగదును కాంగ్రెస్ నేతలు మర్రెడ్డి, రాజ్‌కుమార్, భరత్‌లు బాధిత కుటుంబాలకు అందించారు.

వర్ధన్నపేట : ఇటీవల మృతిచెందిన మండలంలోని



కట్య్రాలకు చెందిన బీజేపీ యువమోర్చా నియోజకవర్గ కన్వీనర్, గీత కార్మికుడు చెంగల సురేశ్ చిత్రపటానికి బీజేపీ ఉమ్మడి వరంగల్ జిల్లా మాజీ అధ్యక్షుడు ఎడ్ల అశోక్‌రెడ్డి పూలమాల వేసి నివాళులర్పించారు. బాధిత కుటుంబాన్ని పరామర్శించి అండగా ఉంటానని హామీ ఇచ్చారు.

రాయపర్తి: మండలంలోని కొత్తూరు, వెంకటేశ్వరపల్లి గ్రామాల్లో మృతుల కుటుంబాలకు ఎస్‌ఆర్‌ఆర్ ఫౌండేషన్ చైర్మన్ పరుపాటి శ్రీనివాస్‌రెడ్డి ఆధ్వర్యంలో బుధవారం బియ్యం, ఆయిల్ క్యాన్‌లను ఆర్థిక సహాయంగా అందించినట్లు మాజీ ఎంపీపీ జినుగు అనిమిరెడ్డి, మాజీ జెడ్పీటీసీ రంగు కుమార్‌గౌడ్ తెలిపారు.

పోస్టాఫీస్‌లో ఆధార్ సేవలు పునఃప్రారంభం



ఆధార్ సేవలను ప్రారంభిస్తున్న సబ్ డివిజనల్ ఇన్‌స్పెక్టర్ సుచేందర్

నర్సంపేట : పట్టణంలోని పోస్టాఫీస్‌లో ఆధార్ సేవలను పునఃప్రారంభించినట్లు నర్సంపేట సబ్ డివిజనల్ ఇన్‌స్పెక్టర్ సుచేందర్ బుధవారం తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రజలు పోస్టాఫీస్‌లో ఆధార్ సేవలను సద్వినియోగం చేసుకోవాలని కోరారు. కొత్తగా ఆధార్ నమోదు ఉచితం, ఆధార్‌లో డెమోగ్రాఫిక్ సవరణలకు రూ.50, బయోమెట్రిక్ సవరణలు 15 ఏళ్లలోపు వారికి ఉచితం, 16 ఏళ్లు పైబడిన వారికి రూ.100, ఆధార్‌ప్రింట్ కోసం రూ.30 చార్జి ఉంటుందని తెలిపారు. కార్యక్రమంలో పోస్ట్‌మాస్టర్ సుధాకర్, పీఏ అజన్, ఎంటీఎస్ రాజు, పోస్టల్ సిబ్బంది పాల్గొన్నారు.

కాల్వ భూమి పరిశీలన



కాల్వను పరిశీలిస్తున్న తహసీల్దార్ వెంకటస్వామి

పర్వతగిరి : మండల కేంద్రానికి చెందిన పెద్ద చెరువు రిజర్వాయర్ కాల్వ భూమిని తహసీల్దార్ వెంకటస్వామి పరిశీలించారు. కొంతమంది రైతుల విజ్ఞప్తి మేరకు బుధవారం పంట కాల్వ భూమిని పరిశీలించి కాల్వకు ఇరువైపులా ఆరు ఫీట్లు వదిలిపెట్టాలని రైతులను ఆదేశించారు. చెరువు కాల్వ కొంతమంది ప్రయోజనాల కోసమేనని ఆరోపించారు. కాగా తహసీల్దార్‌ను వివరణ కోరగా చెరువు కాల్వ మ్యాప్ ఉందని మ్యాప్ ప్రకారం బాట తీస్తామని తెలిపారు. ఆయన వెంట ఆర్‌ఐ కస్నా, రెవెన్యూ సిబ్బంది శంకర్, ఉన్నారు.